
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 5 మార్చి 2025



వాట్సాప్ ద్వారా పదోతరగతి హాల్‌టిక్కెట్లు

నరసన్నపేట, మార్చి4(ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలు ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టిక్కెట్లను సంబంధిత పాఠశాలల లాగిన్‌లో విద్యాశాఖ అధికారులు అప్‌లోడ్ చేశారు. విద్యార్థులు వాట్సాప్ (మన మిత్ర) ద్వారా హాల్ టిక్కెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు ఇవ్వడం లేదు. ఇటువంటి వాటికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం వాట్సాప్‌లో **95523 00009** నెంబర్ ద్వారా హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించింది.

తీరం గుండె కోత!

శ్రీకాకుళం
జిల్లాలో తీర ప్రాంతం కోతకు గురవుతున్నట్టు ఇటీవల కాలంలో వివిధ వర్గాల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆందోళన నిజమేనని తాజాగా ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే నివేదిక స్పష్టం చేసింది. జిల్లాలో 66.6 కిలోమీటర్ల మేర తీరం కోతకు గురైనట్టు ఆ నివేదిక వెల్లడించింది. దీనితో పాటు మరికొన్ని అంశాలనూ ఆ నివేదిక ప్రస్తావించింది.





కవిటి మండలం ఇద్దివానిపాలెంలో ముందుకొచ్చిన సముద్రపు నీరు.. చెల్లాచెదురైన బోట్లు(ఫైల్)

- **తీరప్రాంత కోత ఇలా...**

1990 నుంచి 2021 వరకు ఉపగ్రహ డేటాను ఉపయోగించి ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో 974 చదరపు కిలోమీటర్ల మేరకు మార్పుల మ్యాపింగ్ జరిగింది. తీర ప్రాంత కోత, వృద్ధికి సంబంధించి హాట్ స్పాట్‌లను గుర్తించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. తీరప్రాంత మార్పు విశ్లేషణ ప్రకారం 264.46 కిలోమీటర్ల (26 శాతం) మేర కోతకు గురైంది. 550.75 కిలోమీటర్లు (54 శాతం) పెరిగింది. 203.09 కిలోమీటర్లు (20 శాతం) స్థిరమైన స్థితిలో ఉంది. శ్రీకాకుళం జిల్లాలో 66.6 కిలోమీటర్లు తీరం గరిష్ఠంగా కోతకు గురైనట్లు గుర్తించారు. క్షేత్ర స్థాయి పరిశీలన... అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

- జిల్లాలో 66.6 కిలోమీటర్ల మేర గుర్తింపు
- ఉపగ్రహ డేటా ఆధారంగా..
- మేఘవరంలో క్యాప్టివ్ పోర్టు..
- ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణకు డీఎంఎఫ్ నిధులు
- తలసరి ఆదాయంలో ఇప్పటికీ మనకు వెనుకబాటే
- సామాజిక ఆర్థిక సర్వే నివేదిక వెల్లడి

శ్రీకాకుళం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మన రాష్ట్రంలో అత్యధిక తీర ప్రాంతం ఉన్న జిల్లా శ్రీకాకుళమే. మారుతున్న పర్యావరణ పరిస్థితుల రీత్యా జిల్లాలో సుదీర్ఘ తీరప్రాంతం కోతకు గురవుతోంది. 21 ఏళ్లలో జిల్లాలో ఏకంగా 66.6 కిలోమీటర్ల తీరం కోతకు గురైనట్లు ప్రభుత్వం నిర్ధారించింది. తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలోని ప్రణాళికవిభాగం 2024-25 సంవత్సరానికి సంబంధించి 'సామాజిక ఆర్థిక సర్వే' నివేదికను విడుదల చేసింది. ఇందులో జిల్లాకు సంబంధించి కీలక ప్రాజెక్టులు...వాటి దశలు తదితరమైనవి ఉన్నాయి.

- **నివేదికలోని ఇతర అంశాలు..**

- మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ ప్రాజెక్టుల అమలుకు 26 జిల్లాల్లోనూ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టులను (డీఎంఎఫ్‌టీ) ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.
- డీఎంఎఫ్ కింద రూ. 2,138 కోట్లు సేకరించాల్సి ఉంది. అలాగే 20,678 ప్రాజెక్టులు, పథకాలకు రూ.2,075 కోట్లు మంజూరు చేశారు.
- ప్రధానమంత్రి కృషి కల్యాణ్‌యోజన(పీఎంకేకేవై) కింద భౌతిక, మౌలిక సదుపాయాల కోసం రూ.1198 కోట్లు, తాగునీటి సరఫరాకు రూ.378 కోట్లు, విద్య, ఆరోగ్య సంరక్షణ, సంక్షేమం కోసం రూ.213 కోట్లు కేటాయించాలి.
- డీఎంఎఫ్ నిధులతో శ్రీకాకుళంలో ఆలివర్ రిడ్లే తాబేళ్ల పరిరక్షణప్రాజెక్ట్‌కు తోడ్పాటు అందించాలి.
- 2024-25లో జిల్లాలో వర్షపాతం -5.8 శాతం
- వామపక్ష తీవ్రవాదుల (లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రిమిజం) హింసతో ప్రభావితమైన మారుమూల ప్రాంతాలకు సజావుగా కనెక్టివిటీని అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్న 'వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలకు రోడ్ కనెక్టివిటీ' ప్రాజెక్టు(ఆర్‌సీపీఎల్‌డబ్ల్యుఈ) కింద రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పు గోదావరి జిల్లాలకు 46 పనులు(30 రోడ్లు, 16 వంతెనలు) మంజూరు చేశారు. వీటిలో 27 రోడ్లు, 14 వంతెనలు పూర్తయ్యాయి. దాదాపు 397కిలోమీటర్ల రోడ్డును రూ. 391 కోట్లతో అప్‌గ్రేడ్ చేశారు.
- ప్రభుత్వ పాలిటెక్నిక్ విభాగంలో శ్రీకాకుళంలో ఐసీసీ నిర్మాణాన్ని రూ.126.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టింది. ప్రస్తుతం ఇది పూర్తయ్యే దశలో ఉంది.
- ఫేజ్ -2లో భాగంగా శ్రీకాకుళంలో ఆటోమెషిన్ ఆఫ్‌డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్స్(ఏడీటీటీ)ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. రోడ్డు భద్రత కోసం ఎగ్జిక్యూటివ్ కమిటీ అవసరమైన సివిల్ పనులకు హాజరు కావడానికి అనుమతి ఇచ్చి టెండర్లను పిలిచింది.
- విమానాశ్రయ అభివృద్ధి, ప్రాంతీయ, జాతీయ విమానయాన **(మిగతా 6వ పేజీలో..)**

నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు


- తాగునీటి సమస్య లేకుండా చర్యలు: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పక్కన జేసీ

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జేసీ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'గ్రామ సచివాలయ ఉద్యోగులు ముందస్తు అనుమతి లేకుండా సెలవుపై వెళితే, ఆ సెలవులను సంబంధిత జిల్లా అధికారులు రెగ్యులర్ చేయరాదు. సచివాలయ సిబ్బంది హాజరు 90శాతానికి తగ్గరాదు. జిల్లాలో సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్టుల లక్ష్యాలను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి సర్వే 8 నుంచి 18లోపు పూర్తి చేయాలి. ఐవీఆర్ఎస్, క్యూఆర్‌కోడ్, కాల్స్ వంటి విధానాల ద్వారా సర్వేలో సానుకూల ప్రజా దృక్పథం రావాలి. మంచి ఫలితాల కోసం ప్రతీ శాఖ నోడల్ అధికారిని నియమించాలి. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఎక్కువ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలి. నిధుల కొరత లేదు. ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల'ని ఆదేశించారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ పద్మావతి, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, సీపీఓ లక్ష్మీప్రసన్న, వ్యవసాయాధికారి కోరాడ త్రినాథస్వామి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలకు చెక్



- కొత్తచట్టం రూపొందిస్తున్న కూటమి ప్రభుత్వం
- ముసాయిదా విడుదల
- ఈ నెల 7వరకు అభ్యంతరాల స్వీకరణ

గార మండలం నుంచి స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలు 2023లో సాధారణ బదిలీపై మందస మండలంలోని ఒక ఉన్నత పాఠశాలకు వెళ్లారు. అక్కడ కొద్ది రోజులు మాత్రమే పని చేశారు. మళ్లీ రెండు నెలలు తర్వాత ప్రత్యేక బదిలీ ద్వారా.. ఎచ్చెర్ల మండలంలో ఒక ఉన్నత పాఠశాలకు వచ్చారు. ఎప్పుడు బదిలీలు జరిగినా.. ఈ ఉపాధ్యాయురాలు దూర ప్రాంతానికి వెళ్లడం.. కొద్దిరోజుల తర్వాత మళ్లీ శ్రీకాకుళం పరిసర మండలాలకు ప్రత్యేక బదిలీపై రావడం పరిపాటిగా మారింది. ఇకపై ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేసేలా కూటమి ప్రభుత్వం కొత్త చట్టం రూపొందిస్తోంది.

నరసన్నపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను క్రమబద్ధం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఉపాధ్యాయుల బదిలీ చట్టం రూపకల్పనకు ఇటీవల ముసాయిదా విడుదల చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల బదిలీలు ఇష్టానుసారంగా జరిగాయి. సాధారణంగా కౌన్సిలింగ్ పద్ధతి ప్రకారం కాకుండా సిఫారసుల ఆధారంగా బదిలీలు సాగేవి. ఇటువంటి అక్రమాలకు తావులేకుండా ఏటా మే 31 నాటికి బదిలీలు చేపట్టి.. పునఃప్రారంభం నాటికి కొత్త పాఠశాలల్లో ఉపాధ్యాయులు చేరేలా ముసాయిదా సిద్ధం చేసింది. ఏటా బదిలీల ద్వారా ఖాళీస్థానాల్లో సర్దుబాటు చేస్తే ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కానున్నాయి.

- ఉమ్మడి జిల్లాలో 1,895 ప్రభుత్వ ప్రాథమిక, 332 ప్రాథమికోన్నత, 334 ఉన్నత పాఠశాలలు మొత్తం 2,561 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్, వివిధ భాష పండితులు, స్కూల్ అసిస్టెంట్‌లు, ప్రధానోపాధ్యాయులు 10,914 మంది పనిచేస్తున్నారు. 2023 జూన్‌లో సాధారణ బదిలీల్లో సుమారు 3వేల మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. కాగా కొంతమంది ఉపాధ్యాయులు బదిలీలకు ముందు ప్రిఫరెన్స్ కేటగిరిలో బదిలీల కోసం ఏ మాత్రం అంగవైకల్యం లేకున్నా.. 70శాతం కంటే దివ్యాంగులుగా చూపి ధ్రువీకరణ పత్రాలు పొందారు. వాటి ఆధారంగా ఆయా మండలాల్లోని పాఠశాలల్లో తిష్ట వేస్తున్నారు. ఇలా దీర్ఘకాలిక అనారోగ్యం, దివ్యాంగులుగా కొంత మంది ఉపాధ్యాయులు తప్పుడు పత్రాలతో బదిలీల్లో అడ్డదారులు అనుసరిస్తున్నారు. దీంతో బదిలీల ముందురోజు వరకూ సీనియర్‌గా ఉన్న ఉపాధ్యాయులు.. ఉన్నఫలంగా జూనియర్‌గా మారిపోతారు. అర్హులైన వారికి దగ్గరి ప్లేస్‌లు దొరకవు. ఎప్పుడు పడితే అప్పుడు షెడ్యూల్ మేరకు బదిలీలు జరుగుతాయన్న నమ్మకం కూడా ఉండదు. విద్యా సంవత్సరం మధ్యలోనో, ఆఖర్లోనో ఉన్నఫలంగా బదిలీ చేస్తారు. కోర్టు కేసుల వల్ల ఒక్కో జిల్లాలో ఒక్కోలా ప్రమోషన్లు సాగుతాయి. కొన్ని ఆగిపోతాయి కూడా. ఇటువంటి వాటికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం రాష్ట్ర బదిలీల నియంత్రణ చట్టం-2025 అమలులోకి **(మిగతా 6వ పేజీలో..)**



శుభపరిణామమే
ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియకు చట్టబద్ధత కల్పించడం శుభపరిణామమే. ఏటా విద్యాసంవత్సరం ఆరంభానికి ముందే బదిలీలు చేపట్టాలి. ఉపాధ్యాయుల సర్వీసుకు ఏడాదికి ఇస్తున్న ఒక పాయింట్‌కు అదనంగా 0.5 కేటాయిస్తే బాగుంటుంది.
బమ్మిడి శ్రీరామమూర్తి, యుటీఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి



రెవెన్యూ డివిజన్ ఆధారంగా..
ఉపాధ్యాయ బదిలీల చట్టంలో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులకు ఇతర రెవెన్యూ డివిజన్ ప్రాంతాలకు బదిలీలు చేస్తుంటారు. అలా కాకుండా ప్రస్తుతం పనిచేస్తున్న రెవెన్యూ డివిజన్ పరిధిలోని పాఠశాలలకే బదిలీ చేసేలా చట్టబద్ధత కల్పించాలి.
- బుద్దల కేశవరావు, ఏపీటీఎఫ్ 1938 మండలశాఖ అధ్యక్షుడు



కనీసం ఇద్దరు ఉండేలా..
ప్రతీ పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చట్టం ఉండాలి. రేషన్‌లైజేషన్‌కు గురైయితే అలాంటి ఉపాధ్యాయులు మండల పరిధిలోని సర్దుబాటు చేసేలా మార్గదర్శకాలను చట్టంలో పొందుపరచాలి.
- దవళ సరస్వతి, ఏపీటీఎఫ్ -257 రాష్ట్ర కార్యదర్శి



ఆఫ్‌లైన్ విధానంలో చేపట్టాలి
ఉపాధ్యాయుల బదిలీలను ఆన్‌లైన్ కాకుండా ఆఫ్‌లైన్ విధానంలో చేపట్టాలి. చట్టబద్ధత కల్పించడం ద్వారా పారదర్శకంగా ఉపాధ్యాయులు బదిలీలు జరుగుతాయి. ప్రభుత్వాలు మారినా.. విధానాలు స్థిరంగా ఉంటాయి.
- టి. మురళీమోహన్, పీఆర్‌టీయూ, జిల్లా అధ్యక్షుడు

ఉప్పు భూములకు హద్దులు లేవు

- టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి



టెక్కలి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలంలో ఉప్పు భూములకు హద్దులు లేవని, ఇది ప్రభుత్వ భూమి అని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 'నౌపడా ప్రాంతంలో సుమారు ఐదువేల హెక్టార్ల పరిధిలో ఉప్పు భూములు ఉన్నాయి. నౌపడా సాల్ట్‌ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్ఎస్‌పీఎల్) 375.64 ఎకరాలకు 2,027 వరకు లీజు పొందింది. పోర్టు ప్రాంతంలో 12మీటర్ల అత్యవసర రోడ్డు మూలంగా ఆ ప్రాంత పరిధిలో ఉన్న 425 ఎకరాల ఉప్పు భూముల్లో.. ఎన్ఎస్‌పీఎల్‌కు సంబంధించిన 375.64 ఎకరాలు పోగా మిగిలిన 50.64ఎకరాల్లో కొంతమేరకు రోడ్డు సౌకర్యం కల్పించే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. అయితే ఎన్ఎస్‌పీఎల్ యంత్రాంగం తమకు లీజులు ఉన్నాయని చెబుతుండడంతో నష్టం జరిగిన ప్రాంతాన్ని ప్రాథమికంగా గుర్తించి వారికి పంట పరిహారం అందించేందుకు ఏపీ మారిటైం బోర్డు సిద్ధంగా ఉంది. వాస్తవానికి ఉప్పు భూములకు సంబంధించి సర్వే నెంబర్లు లేవు. అసలు సర్వేలే జరగలేదు. భూమికి ప్రామాణికం రెవెన్యూ రికార్డులే. ఎన్ఎస్‌పీఎల్ దగ్గర ఉప్పు భూముల సర్వే నెంబర్లు తప్పు. వారు సరిహద్దులు చూపించలేకపోతున్నారు. ప్రస్తుతం ఎన్ఎస్‌పీఎల్ హైకోర్టులో స్టేటస్‌కో తేవడంతో రోడ్డు పనులు అర్థాంతరంగా ఆపేశాం. నౌపడా ప్రాంతంలో కాకరాపల్లి, ఆకాశలక్కవరం, పోతునాయుడుపేట, యామాలపేట, కూర్మనాథపురం, కస్పా నౌపడా, మర్రిపాడు, సందిపేట, రాజపురం గ్రామాల పరిధిలో ఉప్పు భూములు ఉన్నాయని తెలిపారు. ఏపీఐఐసీకి 1,300ఎకరాలు, సమీర్‌పేట లాజిస్టిక్‌కు 1,860 ఎకరాలు గతంలో కేటాయించామ'ని తెలిపారు. సంబంధిత ఉప్పు భూముల వివరాలను మ్యాప్ ద్వారా వివరించారు.

పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి
- సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి
8లో

రమేష్.. కళలకు జీవం
- సూక్ష్మచిత్రాలతో అరుదైన గుర్తింపు
- ఆయన ప్రతిభకు ఎన్నో సత్కారాలు
6లో

సర్వే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి
- కలెక్టరేట్ వద్ద నిరసన
- కలెక్టర్‌కు వినతి
7లో



సిరిమాను సంబరంలో పాల్గొన్న భక్తులు



అసిరితల్లి ఉత్సవంలో పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్

వైభవంగా అసిరితల్లి సిరిమానోత్సవం

- పూసర్లపాడులో పండుగ సందడి
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

7లో

అసిరితల్లిని దర్శించుకున్న

హైకోర్టు జడ్జి

గార, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గార మండలం పూసర్లపాడులో అసిరితల్లిని హైకోర్టు జడ్జి జస్టిస్ తర్లాడ రాజశేఖరరావు దంపతులు దర్శించుకున్నారు. మంగళవారం అసిరితల్లి సిరిమానోత్సవంలో పాల్గొని.. అమ్మవారికి పూజలు చేశారు.

వైసీపీ సమావేశానికి..

సీనియర్ నేతల గైర్హాజరు

శ్రీకాకుళం క్రైం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు మంగళవారం శ్రీకాకుళంలో నిర్వహించిన సమావేశానికి జిల్లాలోని ఆ పార్టీకి చెందిన సీనియర్ నేతలు డుమ్మా కొట్టారు. పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీని బలోపేతం చేసేందుకుగాను తొలిసారిగా కన్నబాబు శ్రీకాకుళంలో పర్యటించారు. ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. అయితే సీనియర్ నేతలు మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంతోపాటు వారి వారసులు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, తమ్మినేని చిరంజీవి నాగ్ సమావేశానికి గైర్హాజరయ్యారు. ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్తగా చింతాడ రవిని నియమించడంతో తమ్మినేని సీతారాం, చిరంజీవి నాగ్ పార్టీ కార్యక్రమాలకు దూరంగానే ఉంటున్నారు. అలాగే గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో గొండు శంకర్‌పై పోటీ చేసి 52వేల ఓట్లతో ఓటమి పాలైన తర్వాత ధర్మాన ప్రసాదరావు పార్టీ కార్యక్రమాలకు హాజరుకావడం లేదు. గత నెల 20న వైసీపీ అధినేత జగన్ పాలకొండలో పర్యటించగా.. అప్పుడు ధర్మాన ఆయనను కలిశారు. దీంతో ధర్మాన తిరిగొచ్చారని అంతా అనుకున్నారు. కానీ, ఆయన మాత్రం పార్టీకి దూరంగానే ఉన్నారు. ఒకప్పుడు తాను బాధ్యతలు చేపట్టిన ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ పదవిని కురసాల కన్నబాబుకు కట్టబెట్టగా.. ఆయన నిర్వహించిన సమావేశానికి ధర్మాన హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా కురసాల కన్నబాబు.. మాజీమంత్రి ధర్మాన ప్రసాద రావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

రమేష్.. కళలకు జీవం

- సూక్ష్మచిత్రాలతో అరుదైన గుర్తింపు
- ఆయన ప్రతిభకు ఎన్నో సత్కారాలు



అవార్డులతో కొత్తపల్లి రమేష్

కాశీబుగ్గ, మార్చి 4(ఆంధ్రజ్యోతి):

బంగారంతో సూక్ష్మ వరల్డ్‌కప్.. విక్రమ ల్యాండర్ వేస్తారు. సుద్దముక్కపై చిన్న చిన్న చిత్రాలు గీస్తారు. బొమ్మతో మాట్లాడిస్తారు. ఆయనే పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 21వవార్డు గాంధీనగర్‌కు చెందిన సూక్ష్మ స్వర్ణకారుడు కొత్తపల్లి రమేష్. ఆయన తండ్రి స్వర్ణకారుడు. బంగార ఆభరణాలు తయారీలో నిపుణుడు. ఈ నేపథ్యంలో రమేష్ మొట్ట మొదటి సారిగా సూక్ష్మ బంగారు వరల్డ్‌కప్ తయారు చేసి అబ్బురపరిచారు. అతుకుల్లేని భారతదేశపు చిత్రపటం, త్రివర్ణ పతాకం, విక్రమ్‌ల్యాండర్, బియ్యం సైజులో ఏసుక్రీస్తు, పెన్సిల్ ముల్లుపై శివలింగం, సుద్దముక్కలపై స్వాతంత్ర్య సమరయోధుల బొమ్మలు, పలు సూక్ష్మ కళాఖండాలు తయారుచేసి అందరినీ ఆకట్టుకుంటున్నారు. అంతేకాదు.. డబ్బింగ్ ఆర్టిస్టుగా, సింగర్‌గా కూడా రాణిస్తున్నారు. ఇప్పటి వరకు రెండువేలకు పైగా వ్యాపార ప్రకటనలకు తన వాయిస్ అందించాడు. మిమిక్రి కళాకారుడిగా బొమ్మతో మాట్లాడిస్తారు. ఆయన ప్రతిభను గుర్తించి ఇప్పటివరకు పలు సంస్థలు 150 సార్లు సత్కారాలు చేశాయి. నూతన ఏడాది వేడుకలకు బియ్యం గింజంత సైజులో వెల్కమ్ 2025 లోగో తయారు చేసి శుభాకాంక్షలు తెలిపారు. దీనికి కోసం గంట సమయం పట్టినట్లు చెప్పారు. దీనికి 0.30 మిల్లీ గ్రాముల బంగారాన్ని ఉపయోగించినట్లు తెలిపారు. దీనిఎత్తు కేవలం అర సెంటీమీటరు. బంగారంపై, పెన్సిల్‌పై, కాగితంపై, సుద్ద ముక్కలపై పలు కళాఖండాలు వేసి ఆకట్టుకుంటున్నారు.



బంగారంతో తయారు చేసిన విక్రమ్ ల్యాండర్



బంగారంతో చేసిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి లోగో



బంగారంతో తయారుచేసిన వరల్డ్ కప్




బంగారం, సుద్దముక్కతో తయారు చేసిన బొమ్మలు



సుద్దముక్కపై అబ్దుల్‌కలామ్ బొమ్మ

అందమైన చేతిరాతతో.. అధిక మార్కులు





- వ్యక్తిత్వానికి అద్దం పట్టే దస్తూరి
- ఇంటర్, పది విద్యార్థులు శ్రద్ధ పెట్టాలి

నరసన్నపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సమాధానం కచ్చితంగా రాసినా, పేపరు దిద్దేవారికి అది అర్థమైనప్పుడే మంచి వచ్చే అవకాశం ఉంటుంది. ఇందుకు చక్కటి చేతిరాత అవసరం. ఎంత బాగా చదివినా.. ఎంతగొప్పగా పరీక్ష రాసినా అక్షరాలు అర్థం కాకుంటే సమాధాన పత్రాలు దిద్దేవారికి కొంత ఇబ్బందిగా ఉంటుంది. ఆ ప్రభావం మార్కులపై పడుతుంది.

మంచి మార్కులు రావాలంటే..

అందమైన చేతిరాత విద్యార్థుల భవితను నిర్దేశిస్తుంది. పరీక్షల సమయంలో విద్యార్థులు గజిబిజిగా కాకుండా, అర్థమయ్యేలా రాస్తే మంచి మార్కులు సాధించవచ్చు. అలాగే కొన్ని జాగ్రత్తలు పాటిస్తే చేతిరాతపై పట్టు సాధించవచ్చునని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. ఇంటర్, పదోతరగతి పరీక్షలు జరుగునున్న దృష్ట్యా విద్యార్థులు చేతిరాతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. కొట్టివేతలు లేకుండా చక్కగారాస్తే మంచి ఫలితం ఉంటుందంటున్నారు.

చదవాలనినిపించాలి..

విషయం ఏదైనా ముత్యాల వంటి అక్షరాలు చూస్తే చదవాలనిపించాలి. సాంకేతికంగా ఎన్ని మార్పులు వచ్చినా చేతిరాత ప్రాధాన్యం ఎన్నటికీ తగ్గదు. మెరుగైన చేతిరాతతో వ్యక్తిత్వాన్ని ఇనుమడింప చేసుకోవచ్చు. అందమైన అక్షరాల ద్వారానే భావాన్ని వ్యక్తీకరించగలం. ఉపాధ్యాయుడు ఏ అక్షరం వద్ద తప్పు రాస్తున్నాడో గుర్తించి సరిచేస్తే ఆ విద్యార్థి మళ్లీ ఆ తప్పుచేయడు. కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా చేతిరాత మెరుగుపరుచుకోవడం ఏమంత కష్టం కాదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

● ముఖ్యంగా అక్షరాల సైజు ఒకేలా ఉండేలా చూసుకోవాలి. ● అక్షరాలు, పదాల మధ్య సమాన దూరం ఉండేటట్టు జాగ్రత్తపడాలి. ● అక్షరాలను ఒకే గీతపై ఉండేలా చూసుకోవాలి. ● కొట్టివేతలు, దిద్దివేతలు ఉండకూడదు. అలా ఉంటే చూసేవారికి, సమాధానాలు దిద్దేవారికి ఇబ్బందిగా అనిపించవచ్చు. ● సాధనతో.. వేగంతో కూడిన రాతను ప్రయత్నించాలి.

ఇక్కడ తింటే రోగాలు ఫ్రీ

- అక్కడే తినిపడేసిన ప్లేట్లు.. వాటిపై కాకులు
- ఎచ్చెర్ల, చిలకపాలెం హోటళ్ల వద్ద ఇదీ పరిస్థితి
- చోద్యం చూస్తున్న పంచాయతీ, ఫుడ్‌సేఫ్టీ అధికారులు



ఎచ్చెర్లలోని ఓ హోటల్ వద్ద ఇదీ పరిస్థితి



చిలకపాలెంలో ప్రధాన రహదారి పక్కనే..

ఎచ్చెర్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బాగా ఆకలిగా ఉంది కదాని నాలుగు ఇడ్లీలో, రెండు పూరిలో, ఒక దోసె కానీ తినాలని వెళ్తే ఆ హోటళ్ల వద్ద అపరిశుభ్రత స్వాగతం పలుకుతోంది. రుచి, నాణ్యత సంగతిని పక్కనపెడితే హోటళ్ల వద్ద కనీస శుభ్రత కూడా పాటించడం లేదు. శ్రీకాకుళానికి కూతవేటు దూరంలో ఉన్న ఎచ్చెర్ల, చిలకపాలెంలోని చాలా హోటళ్లలో పరిస్థితి ఇలానే ఉంది. అంతా రోడ్డుపైనే అన్నట్టుగా అక్కడే ప్లేట్లు శుభ్రం చేయడం, అదే నీటిని తిరిగి వినియోగించడం చేస్తున్నారు. రోడ్డు పై తిరిగే వాహనాల వల్ల దుమ్ము, ధూళి కూడా ఆహార పదార్థాలపైకి చేరుతోంది. రోడ్డుపైనే చిన్న కేన్‌తో తాగునీరు, ఆ పక్కనే తినేసిన ప్లేట్లను పడేయడం, రోడ్డుపైనే కూర్చుని తినాల్సిరావడం ఇబ్బందికరంగా ఉందని పలువురు వాపోతున్నారు. ఇలా రోడ్డుపైనే అన్నింటి పడేస్తుండడంతో ఈగలు, దోమలతో పాటు కాకులు కూడా వాటిపై వాలుతున్నాయి. ఎచ్చెర్లలో రోడ్డును, చిలకపాలెంలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుని హోటళ్లు నిర్వహిస్తున్నారు. ఇక్కడ తింటే ఆకలి తీరడం సంగతేమోగానీ జబ్బులు ఖాయమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే కనిపిస్తున్నా పంచాయతీ అధికారుగానీ, ఫుడ్‌సేఫ్టీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు.

8న జామి ఎల్లమ్మ జాతర

అన్ని ఏర్పాట్లు పూర్తి.. పండుగలా నిర్వహించేందుకు చర్యలు



పలాస, మార్చి 4: జామి ఎల్లమ్మ జాతర ఈనెల 8న నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎల్లమ్మవీధిలో వెలసిన ఆలయంలో ప్రతిఏటా శివరాత్రి దాటిన తొమ్మిదోరోజున దీన్ని నిర్వహిస్తారు. మన రాష్ట్రంతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి ఎల్లమ్మను దర్శించుకుని పడి సమర్పిస్తారు. జాతరకు ముందురోజు ఆవాహన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో చేపడుతారు. అమ్మవారి జంగెడను ఆలయ నిర్వాహకులు కొల్లకోట వంశస్థులు నిర్వహిస్తారు. తర్లాకోటలో ఉన్న జమిందారీ వంశస్థులు ఆలయానికి వెళ్లి సింధూర పంట (సింధూరం తీయడం)తో జాతర ప్రారంభం అవుతుంది. జమిందారీ వంశస్థులు తొలిపూజ చేయడంతో పాటు ఆలయాన్ని శుద్ధి చేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పిస్తారు. అమ్మవారికి పడి(బియ్యం, వేప ఆకులు) ముడికట్టి ఆలయ శిఖరంపై విసరడం ఆచారంగా వస్తోంది. భక్తులు ఆదివారం వేకువజాము నుంచి రాత్రి 12 గంటల వరకూ దర్శనం చేసుకుంటారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

పలాసలోని ఎల్లమ్మ ఆలయం ←

గర్భగుడిలో జామి ఎల్లమ్మ →



తీరం గుండె కోత!

(ఐదో పేజీ తరువాయి)

కార్యకలాపాలు, ఇతర మౌలిక సదుపాయాలలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం 2015లో ఆంధ్రప్రదేశ్ పౌర విమానయాన విధానాన్ని విడుదల చేసింది. మెరుగైన ఎయిర్ కనెక్టివిటీ, ఆర్థిక వృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ కొత్త గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలను అభివృద్ధి చేసే లక్ష్యంతో కొత్తగా ఆంధ్రప్రదేశ్ పౌర విమానయాన విధానం-2025 రాబోయే పదేళ్లకు సిద్ధమవుతుంది. ఆంధ్రప్రదేశ్ ఎయిర్‌పోర్ట్సు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఏడీసీఎల్) ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

● మూలపేట పోర్టు (ఓడ రేవు) ల్యాండ్ - లార్డ్ మోడల్ కింద రూ. 4,361.91 కోట్లతో అభివృద్ధి జరుగుతోంది. ప్రస్తుతం పోర్టు పనులను పరిశీలిస్తే.. బ్రేక్ వాటర్స్‌కు సంబంధించి నిర్మాణం 41.38 శాతం, డ్రెడ్జింగ్, రిక్లమేషన్ నిర్మాణం 41.93, బెర్త్‌లు 31.73 శాతం పూర్తయ్యాయి. మొత్తం పోర్టు పనుల్లో పురోగతి 30.09 శాతంగా ఉంది.

● ప్రభుత్వం కొత్తగా పోర్టును ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించింది. జిల్లాలో మేఘవరం (క్యాప్టివ్ పోర్టు) బొగ్గు, థర్మల్ ప్లాంట్లకు ఫ్లయ్ యాష్ దిగుమతి కోసం మైనర్ పోర్టుగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించారు. ప్రాజెక్టు పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

● బుడగట్లపాలెం వద్ద ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి 2022 అక్టోబరు 20న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 'మెస్సర్స్ విశ్వసముద్ర హోల్డింగ్స్ ప్రైవేటు లిమిటెడ్'తో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం అప్రోచ్ రోడ్డు, అంతర్గత రోడ్డు పనుల నిర్వహణకు చర్యలు ప్రారంభమయ్యాయి.

● రాష్ట్రంలో 974 కిలోమీటర్ల తీరం ఉండటంతో.. బీచ్ టూరిజం సర్క్యూట్స్.. హబ్స్‌గా మార్పు చేసేందుకు చర్యలు ప్రారంభించారు. ఇందులో పర్యావరణ పర్యాటక సర్క్యూట్‌ల అభివృద్ధిని ప్రతిపాదించారు.

● శ్రీకాకుళం జిల్లాలో మాంగనీస్‌తో పాటు ఇతర చిన్న ఖనిజాల అన్వేషణకు చర్యలు తీసుకోవాలని.. 'శ్రీకాకుళం బ్లూ గ్రానైట్' మాదిరిగా ఖనిజ పరిశ్రమలు వెలిసేందుకు గుర్తింపు చేపట్టాలని ప్రభుత్వం సూచించింది.

● ఇప్పటికీ రాష్ట్రంలో తలసరి ఆదాయం తక్కువగా ఉన్న మొదటి ఐదు జిల్లాల్లో శ్రీకాకుళం ఒకటిగా నిలవడం గమనార్హం.

ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలకు చెక్

(ఐదో పేజీ తరువాయి)

తెచ్చేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే బదిలీల డ్రాఫ్ట్ విడుదల చేసింది. ఈనెల 7 వరకూ ఉపాధ్యాయుల నుంచి విద్యాశాఖ అభ్యంతరాలు స్వీకరించనుంది. ఈ చట్టానికి ముందు టీచర్ల సీనియారిటీ జాబితాల్లోని లోపాలను సరిచేస్తోంది.

అన్ని డీఎస్సీల లెక్కలు తేలుస్తూ ...

ఉపాధ్యాయల బదిలీలు, ప్రమోషన్లకు సీనియారిటీ జాబితా ముఖ్యం. గతంలో చాలామంది టీచర్లు తాత్కాలిక అవసరాల కోసం బదిలీలు, ప్రమోషన్లలో లబ్ధి పొందేందుకు వ్యక్తిగత సమాచారాన్ని సైతం అడ్డగోలుగా నమోదు చేసుకున్నారు. కొందరు తాము అపాయింట్ అయిన డీఎస్సీ, నియామక తేదీలు, స్కూల్ మేనేజ్‌మెంట్ వివరాలను టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(టీస్)లో సైతం తప్పుగా పొందుపరిచారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం టీచర్ల సీనియారిటీ జాబితాను పూర్తిగా క్రమబద్ధీకరిస్తోంది. నెలరోజులుగా ఉమ్మడి జిల్లా విద్యాశాఖ, ఐటీ సెల్ అధికారులు దీనిపై కసరత్తు చేస్తున్నారు. డీఎస్సీలు 1982, 1984, 1989, 1994 నుంచి 1988 వరకూ, 2000, 2002 నుంచి 2004 వరకూ, 2006, 2008, 2012, 2014, 2018 టీచర్ల వివరాలు సేకరించి, సీనియారిటీ జాబితా సిద్ధం చేశారు.

సమస్యలకు పరిష్కారం

ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్టం క్షేత్రస్థాయిల్లో అమల్లోకి వస్తే.. చాలా సమస్యలకు తెరపడే అవకాశం ఉంది. విద్యా సంవత్సరం మధ్యలో కాకుండా వేసవి సెలవుల్లోనే బదిలీల ప్రక్రియ జరగనుంది. బదిలీలు, ప్రమోషన్లలో సీనియారిటీ జాబితాల్లో అవకతవకలకు అడ్డుకట్ట పడనుంది. భవిష్యత్‌లో సమస్య లేకుండా శాశ్వతమైన సీనియారిటీ జాబితాను విద్యాశాఖాధికారులు సిద్ధం చేస్తున్నారు. దీంతో మెజార్టీ వర్గాలకు న్యాయం చేకూరే అవకాశాలున్నాయి. ప్రిఫరెన్షియల్ కేటగిరీ, బోగస్ దివ్యాంగ సర్టిఫికెట్లు పెట్టి లబ్ధి పొందాలనుకునే వారికి కూడా చెక్ పెట్టే అవకాశం ఉంది. రెండేళ్లు, మూడేళ్లకు బదిలీలు చేపట్టేవారు. ఇకపై ఏటా నిర్వహిస్తామంటుండటం శుభ పరిణామం. దీనిపై మెజార్టీ టీచర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొందరు మాత్రం లోపాలున్నాయని చెబుతున్నారు. తమ అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుని సవరించాలని కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయులు ఇలా

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు	4,928
స్కూల్ అసిస్టెంట్‌లు	5,211
లాంగ్వేజ్ పండిట్‌లు	206
ప్రైమరీ హెచ్‌ఎంలు	237
గ్రేడ్-2 హెచ్‌ఎం	298
పీఈటీలు	34
మొత్తం ఉపాధ్యాయులు	10,914

ఆడిట్‌లో చూపించే లోటుపాట్లపై సమీక్ష: కూన రవికుమార్

శ్రీకాకుళం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్థలు.. ఆడిట్‌లో చూపించే లోటుపాట్లపై తరచూ సమీక్ష నిర్వహిస్తామని పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ ఛైర్మన్ (ఆమదాలవలస ఎమ్మెల్యే) కూన రవికుమార్ అన్నారు. అసెంబ్లీ సమావేశంలో ప్రజాపద్దుల కమిటీ, పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ ఛైర్మన్లతో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రవికుమార్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు కంట్రోల్ ఆడిటర్ జనరల్ ఇచ్చిన సూచనలను అనుసరించి రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేసే సంస్థలు.. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్నదీ లేనిదీ పరిశీలిస్తామని తెలిపారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తామని, అకౌంటెంట్ జనరల్ పంపే సమాచారాన్ని.. ఆడిట్ పేరాలలో లోటుపాట్లపై సమావేశం అవుతామని చెప్పారు. తనను ప్రభుత్వరంగ సంస్థల కమిటీ ఛైర్మన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

బడ్జెట్‌తో స్వర్ణాంధ్ర పునర్నిర్మాణం

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి అభివృద్ధి, సంక్షేమం కోసం నిధులు కేటాయిస్తోందని శ్రీకాకుళం శాసనసభ్యుడు గొండు శంకర్ పేర్కొన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో అంతా విధ్వంసకర, అరాచక పాలన సాగిందని విమర్శించారు. అప్పటి పాలకులు వ్యవస్థలను పూర్తి నాశనం చేశారని ధ్వజమెత్తారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో 2014-19 సంవత్సరాల మధ్య ఎంతో అభివృద్ధి చేశామని, అయితే ఆతర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు అభివృద్ధిని నిలిపివేసిందని ఆరోపించారు. శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డులో ఎందరో ప్రాణాలు కోల్పోయారని.. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.16 కోట్లతో రోడ్డు పనులు పూర్తిచేశామని చెప్పారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో 18 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మాణం చేశామని, ట్రాక్టర్ ఇసుకను రూ.700కే ఇస్తున్నామని వివరించారు. కౌరవసభగా ఉన్న అసెంబ్లీని గౌరవసభగా ముఖ్యమంత్రి తీర్చిదిద్దారని కొనియాడారు.

జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పాతపట్నం నియోజకవర్గంలో ఐటీ డీఏ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. మంగళ వారం శాసనసభ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-26 బడ్జెట్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగా లకు పెద్దపీట వేయడం హర్షణీయమన్నారు. వంశధార, నాగావళి అనుసంధా నానికి పరిస్థితులు ఏర్పడడంతో నియోజకవర్గ ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజ నాలు సమకూరుతాయన్నారు. బీసీల సంక్షేమానికి భారీగా నిధులు కేటాయించడం ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

చెత్త పేరుకుపోయి.. శుభ్రతకు నోచుకోక

● గాడితప్పిన పారిశుధ్య నిర్వహణ
● ఇదీ శ్రీకాకుళం నగరపాలక సంస్థలో పరిస్థితి

శ్రీకాకుళం అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణ గాడితప్పుతోంది. నిర్వహణలోపం వల్ల ప్రధాన జంక్షన్లల్లో చెత్త పేరుకుపోతోంది. దీంతో శుభ్రతకు నోచుకోకపోవడంతో చీకటిపడితే దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛ శ్రీకాకుళం లక్ష్యమని, ఆ దిశగా ముందుకు సాగుతున్నామని నగరపాలక సంస్థ అధికారుల ప్రకటనలు అటకెక్కుతున్నాయి. మునిసిపాలిటీ నుంచి అప్‌గ్రేడ్ చేసిన తర్వాత సిబ్బంది పెరిగినా పారిశుధ్య నిర్వహణపై నిర్లక్ష్యం చూపుతున్నారని పలువురు నగరవాసులు ఆరోపిస్తున్నారు. డేఅండ్‌నైట్‌జంక్షన్, జిల్లా కోర్టురోడ్డు తదితర ప్రాంతాల్లో చెత్త రోడ్డుపైనే కుప్పలుగా పేరుకుపోతోంది. దీంతో నిత్యం రద్దీగాఉండే ప్రాంతాలు కావడంతో ప్రజలు దుర్వాసనతో అవస్థలకుగురవుతున్నారు. ప్రతిరోజూ చెత్త సేకరించాల్సిన పారిశుధ్య కార్మికులు పలుచోట్ల ఏర్పాటుచేసిన డ్రమ్ముల నుంచి తరలించడంలేదు.దీంతో పశువులు,కుక్కలు చెత్తను చింతరవందర చేస్తుండడంతో త్వరగా కుళ్లి దుర్గంధం వెలువడుతోంది.నగర పాలకసంస్థ అధికారులు పారిశుధ్య నిర్వహణపైదృష్టిసారించి, ప్రజారోగ్యాన్నికాపాడాలని పలువురు కోరుతున్నారు.


నగరంలో ఆర్టీసీ కాంప్లెక్స్ దాటిన తర్వాత రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

అంగరంగ వైభవంగా అసిరితల్లి సిరిమానోత్సవం

● పూసర్లపాడులో సందడి ● తరలివచ్చిన వేలాది మంది భక్తులు


పూసర్లపాడులో భక్తుల రద్దీ

గార, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూసర్లపాడు అసిరితల్లి పండుగ పురస్కరించుకుని మంగళవారం సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిమానును మేళతాళాలతో డప్పు వాయిద్యాలు నడుమ మహిళలు ఘటాలతో ఊరేగించారు.నాలుగు దశాబ్దాల తర్వాత ఈ ఉత్సవాలు జరుగుతుండడంతో సిరిమాను సంబరం తిలకించేందుకు పరిసరగ్రామాలతోపాటు జిల్లాలో నలుమూలల నుంచివేలాది మంది తరలిరావడంతో పూసర్లపాడులో భక్తులతో సందడి నెలకొంది. సిరిమాను ఊరేగింపులో అవాంఛనీయసంఘటనలు జరగకుండా సీఐ పైడపునాయుడు, గారఎస్‌ఐ జనార్దన్ ఆధ్వర్యంలో పోలీస్‌బందోబస్తు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్డుపై కూరుకుపోయిన లారీ

● గంటల కొద్దీ నిలిచిపోయిన వాహనాలు
● దవళపేట కూడలిలో ప్రయాణికుల అవస్థలు


దవళపేట కూడలిలో రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

జి.సిగడాం, మార్చి 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని దవళపేట కూడలి వద్ద మంగళవారం భారీలోడుతో వెళ్తున్న లారీ కూరుకుపోయింది. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. వాహనాల రాకపోకలు స్తంభించపోవడంతో ప్రయాణికులు,వాహనచోదకులు అవస్థలకు గురయ్యారు.దవళపేట కూడలి వద్ద చిలకపాలెం-రాజాం ప్రధాన రహదారికి సంబంధించిన కల్వర్టు పనులు జరుగుతున్నాయి.దీంతో ఇరువైపుల నుంచి వచ్చిన వాహనాలు రాకపోకలు సాగించేందుకు డైవర్షన్ రోడ్డు ఏర్పాటుచేశారు.ఈనేపథ్యంలో శనివారం కూడా ఓ లారీ ఇక్కడ కూరుకుపోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోవడంతో సుమారు ఆరుగంటలపాటు ప్రయాణికులు అవస్థలకు గురైన విషయంవిదితమే.వాహనాల రాకపోకలతో నిత్యంరద్దీగా ఉండే ప్రధానరహదారిలో కల్వర్టు పనులు త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సర్వే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ గేటు వద్ద నిరసన తెలియజేస్తున్న గ్రామ సర్వేయర్లు

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రీసర్వేలో పాల్గొంటున్న సర్వే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విలేజ్ సర్వేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరాడ మధుబాబు కోరారు. ఈమేరకు అసోసియేషన్ సభ్యులతో కలిసి మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలెట్ గ్రామాల్లో రీసర్వే వర్క్ కోసం డిప్యూటేషన్ వెళ్తుండడంతో విలేజ్ సర్వేయర్స్‌కు బయోమెట్రిక్ నుంచి వెసులుబాటు కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

శ్రీకాకుళం రూరల్,మార్చి 4(ఆంధ్రజ్యోతి):కార్యకర్తలకు అండగా ఉంటామని వైసీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలో పార్టీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైసీపీ నాయకులు కార్యకర్తలపై కేసులు,అరెస్టులతో రాజకీయాలుచేస్తోందని ఆరోపించారు. అనంతరం కన్నబాబు విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరేట్ల వద్ద ఫీజు రీయింబర్స్‌మెంట్‌కోసం ఈనెల12న ధర్నాచేస్తున్నట్లు తెలిపారు.సమావేశంలో వైసీపీ నాయకులు ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, పేరాడ తిలక్, గొర్లె కిరణ్‌కుమార్, రెడ్డిశాంతి, చింతాడ రవికుమార్, పిరియా విజయ, మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు పాల్గొన్నారు.

●ఆమదాలవలస, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలసలో తన నివాసం మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను వైసీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కన్నబాబు కలిశారు.కార్యక్రమంలో చిన్న శ్రీను పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

బూర్జ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్ల జయరాం కోరారు. మంగళవారం కొల్లివలస విలేకరులతో మాట్లాడుతూ దేశం మొత్తం జనసేన వైపు చూస్తోందన్నారు. కార్యక్రమంలో తులగాపు మౌళి, కిల్లాన నరేష్, తులగాపు గౌతమ్, సైరగాపు వెంకటేష్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు: డీఎస్‌వో

జి.సిగడాం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని డీఎస్‌వో జి.సూర్యప్రకాష్ తెలిపారు. మంగళవారం ఆనందపురం, దవళపేట, సంతవురిటిలో ధాన్యంనిల్వలను పరిశీలించారు. మండలంలో 2,300 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఆయన వెంట ఏవో ఎర్రా శారద, వీఏఏలు ముంతా హేమంత్‌కుమార్, అలుగోలు లక్ష్మీనారాయణ, రైతులు ఉన్నారు.

●పొందూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):ధాన్యం కొనుగోలుపై సమాచారంకోసం పంటపొలాల్లో నిల్వలపై కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నట్లు డీఎస్‌వో సూర్యప్రకాశ్ తెలిపారు. మండలంలోని కోటిపల్లి, కనిమెట్ట, పెనుబర్తి, గోరింట, దళ్ళవలసలో మిగిలి ఉన్న ధాన్యం కుప్పలు, నూర్చిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. ఆయన వెంట ఏవో బి.బాబ్జి ఉన్నారు.

●బూర్జ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తావల్లి, లాభాం, పాలవలస, లక్ష్మీపురం గ్రామాల్లో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ధాన్యం, కుప్పలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కుప్పలు, నూర్చిన తర్వాత కొనుగోలు కోసం సిద్ధంగా ఉన్న ధాన్యం నిల్వల వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఏవో ఎన్.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి సివిల్ సప్లై డీటీ మురళీ, వీఏఏలు కృష్ణ, శ్రీను, లక్ష్మీనారాయణ, వసంత, ఇంద్రజ ఉన్నారు.

విజ్ఞానాన్ని పెంచుకోవాలి

సరుబుజ్జిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):విద్యార్థులు విజ్ఞానాభివృద్ధి పెంపొందించుకొనేందుకు కృషి చేయాలని వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య కోరారు. మంగళవారం వెన్నెలవలస ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పీఎం శ్రీకమ్యూనిటీ ఔట్‌రీచ్ కార్య క్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పరికరాలు తయారీ, పనితీరు గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బేతనస్వామి, సీఆర్‌పీ బెండి చిన్నారావు, అత్తులూరి లావణ్య, అత్తులూరి గిరి పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశే లక్ష్యం: ఎంపీ కలిశెట్టి


అప్పన్నను పరామర్శిస్తున్న కలిశెట్టి అప్పలనాయుడు

జి.సిగడాం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి స్వర్ణాంధ్రప్రదేశే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం అడుగులువేస్తోందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు.డీఆర్‌వలసలో మాజీ సర్పంచ్ కుమరాపు అప్పన్న ఇటీవల శస్త్రచికిత్స చేయించుకోవడంతో మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుకు వెళ్తున్నారన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కలిశెట్టి సూర్యనారాయణ, మండలశాఖ అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, డబ్బాడ అదినారాయణ, పోతిరెడ్డి సన్యాసినాయుడు, శ్రీను ఉన్నారు.

జలవనరులను కలుషితం కానివ్వొద్దు

● బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని



ఎచ్చెర్లలో నిర్వహిస్తున్న ర్యాలీలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, అధికారులు

ఎచ్చెర్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి):జలవనరులను కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. మంగళవారం ఎచ్చెర్లల్లోని వర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-6, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాల ఆధ్వర్యంలో నీటివినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం ఎచ్చెర్లలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ఎస్‌వో డాక్టర్ ఎస్.సామ్రాజ్యలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఎ.మురళీమోహన్, వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.వనజ, పీవో బి.విణు , మాజీ సర్పంచ్ మెండ రాజారావు, మాజీ ఉప సర్పంచ్ మూకళ్ల భాస్కరరావు, నిడిగింట్ల రమణ, నిడిగింట్ల సూర్యారావు పాల్గొన్నారు.

హోటళ్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం: కమిషనర్

శ్రీకాకుళం అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): హోటళ్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిషేధించినట్లు నగరపాలక కమిషనర్ పీవీవీ ప్రసాదరావు తెలిపారు. మంగళవారం రాత్రి నగరపాలక సంస్థ కార్యాలయంలో హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్స్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోటళ్ల నుంచి వెలువడే చెత్తను అక్కడే ఆన్‌సైట్ కంపోస్టింగ్ చేసుకోవాలని,ఆ చెత్తతో బయోగ్యాస్‌ను తయారుచేసి వాడుకోవాలని కమిషనర్ సూచించారు. హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధి మెట్ట నాగరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధానికి సహకరిస్తామని తెలిపారు.సమావేశంలో హెల్త్‌ఆఫీసర్ సుధీర్‌కుమార్, హోటళ్ల అసోసియేషన్ ప్రతినిధులు శ్రీను,మురళి పాల్గొన్నారు.

ఫిట్‌నెస్‌లేని ఆటోలు సీజ్: సీఐ

శ్రీకాకుళంక్రైం,మార్చి 4(ఆంధ్రజ్యోతి):ఫిట్‌నెస్‌లేని ఆటోలను సీజ్‌చేస్తామని సీఐ నాగరాజు హెచ్చరించారు. మంగళవారం శ్రీకాకుళంలోని డేఅండ్‌నైట్, పాతబస్టాండ్, మిల్లుజంక్షన్ కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు ఓవర్‌లోడ్ ఆటోలతో కలుగుతున్న ట్రాఫిక్ అంతరాయాన్ని నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఆటోలు, ఫిట్‌నెస్‌లేని ఆటోలను స్టేషన్‌కు తరలించారు. ఆటో డ్రైవర్లకు సీఐ నాగరాజు కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు.ప్రతీ ఆటోకి ఫిట్‌నెస్‌తోపాటు ధ్రువపత్రాలు ఉండకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు.

అదనపు బిల్లుల వసూలుపై విచారణ

పొందూరు,మార్చి 4(ఆంధ్రజ్యోతి): పొందూరులో ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది అదనపు బిల్లులు వసూలుచేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై ఐఓఎల్ అధికారులు మంగళవారం విచారణ నిర్వహించారు. మహిళల వద్దకు వెళ్ళి వివరాలు సేకరించారు.తమసంస్థ ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఐఓఎల్ సేల్స్ ఆఫీసర్ తెలిపారు.కాగా అదనంగా బిల్లులు వసూళ్లపై మూగోడువీధి మహిళలు కలెక్టర్‌కు ఫిర్యాదుచేసిన విషయం విదితమే. దీంతో పౌరసరఫరాల, రెవెన్యూ అధికారులు ఇప్పటికే విచారణచేసి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. ఇక్కడి గ్యాస్ ఏజెన్సీ బాధ్యతలు రణస్థలం ఏజెన్సీకి తహసీల్దార్ ఆర్.వెంకటేష్ అప్పగించారు.

కార్మికులు అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీరాంబాబు కోరారు. మంగళవారం పైడిభీమవరంలో 54వ జాతీయ భద్రతా దినోత్సవం పురస్కరించుకుని డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమ నుంచి ఎపిటోయా వరకూ కార్మికులు యాజమాన్యం భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పరిశ్రమల ప్రతినిధులు కమలాకర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలు ముందుకు సాగాలి

సోంపేట,మార్చి 4(ఆంధ్రజ్యోతి): అన్నిరంగాల్లో ముందున్నారని వారిని మహిళలు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఎస్‌ఐ లవరాజు కోరారు. మంగళవారం సోంపేటలోని ఓ డిగ్రీకళాశాలలో మహిళాదినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలు

సరుబుజ్జిలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపాలెం గ్రామ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవాలు గురువారం నుంచి నిర్వహించనున్నట్లు ధర్మకర్త మెండసూర్యారావు మంగళవారం తెలిపారు. పదోతేదీన పురుషోత్తపురంలోని గ్రామ కామేశ్వర స్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గంగవరపు వాసుదేవశర్మ పేర్కొన్నారు.

12 నుంచి ఫోటోగ్రఫీపై శిక్షణ

ఎచ్చెర్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 12వ తేదీ నుంచి ప్రారంభిస్తున్న ఫోటో అండ్ వీడియోగ్రఫీ కోర్సులోప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివిన 19-45 ఏళ్లలోపు వయసు గల అభ్యర్థులు శిక్షణలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. నెలరోజుల పాటు ఇచ్చే శిక్షణలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫోన్ నెంబర్లు 95534 10809, 79933 40407కు సంప్రదించాలని కోరారు.

సీఎంకు ఆహ్వానం

ఆమదాలవలస, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలో ఈనెల 12న జరిగే తన కుమారుడి వివాహానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మొదలవలస రమేష్ ఆహ్వానించారు. మంగళవారం అమరావతిలో ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో కలిసి రమేష్‌తో పాటు కుమారుడు చందహర్ష కలిశారు. వివాహ ఆహ్వానపత్రిక అందజేశారు.

యాదవులను బీసీ-బిలో చేర్చాలి

కవిటి, మార్చి4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోని యాదవులను తూర్పు యాదవులుగా గుర్తించి బీసీ-బి జాబితాలో చేర్చాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలో బీసీ కమిషన్ చైర్మన్ శంకర్‌నారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని భగవతి స్వేచ్ఛావతి ఆటో ఓనర్స్‌డ్రైవర్స్ సంక్షేమ సంఘం సభ్యుడు రెల్ల గోపి మృతిచెందడంతో సభ్యులు మంగళవారం కుటుంబసభ్యులకు రూ.50 వేలు అందజేశారు.కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బడే మోహన్‌రావు, పూర్ణచంద్రసాహు, ఉలాసి ఎర్రయ్యరెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

●జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

గుజరాతీపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి):ఉద్యోగినులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు కోరారు. మంగళవారం శ్రీకాకుళంలోని ఐసీడీఎస్‌కార్యాలయంలో జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో వివిధశాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ప్రస్తుతం జరుగుతున్న నేరాలు, వాటికి విధిస్తున్న శిక్షలు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో శాంతిశ్రీ, విభిన్న ప్రతిభావంతుల విభాగ పీవో కవిత,పీవోఐసీ మెట్ట మల్లేశ్వరరావు, హారికాప్రసాద్, ఐసీడీఎస్ నోడల్ అధికారి మణెమ్మ, ఎస్‌ఐ లక్ష్మి, లక్ష్మనాయుడు పాల్గొన్నారు.

డొంకూరు బీచ్ మార్గంలో చెత్త తొలగింపు

ఇచ్ఛాపురం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): డొంకూరులోని బీచ్‌కు వెళ్లే మార్గంలో చెత్తతో పాటు తుప్పలు, డొంకలను గ్రామానికి చెందిన రిషికణ్యాన్ ఆధ్వర్యంలో తొలగించారు. కొద్దేళ్లుగా చెత్త పేరుకుపోవడంతో బీచ్‌కు వెళ్లేవారు ఇబ్బందిపడుతున్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా జంగిల్ తొలగించడంతోపాటు పారిశుధ్య పనులు చేపట్టారు.కార్యక్రమంలో సీహెచ్ కృష్ణయ్య, జానికిరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలి

గుజరాతీపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి):మాన్యువల్‌గా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ కోరారు. మంగళవారం శ్రీకాకుళంలో దాసరి క్రాంతిభవన్‌లో ఎస్టీయూ నాయకులతో బదిలీల చట్టంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెబ్ కౌన్సెలింగ్ ద్వారా వేలాది మంది ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.కాగా డ్రాఫ్టుచట్టంపై ఉన్న అభ్యంతరాలను ప్రొఫార్మాలో నింపి పాఠశాల విద్యాశాఖకు మెయిల్‌చేశారు. కార్యక్రమంలో పి.రామకృష్ణ, కె.శ్రీనివాసరావు, జి.శ్రీను, ఎం.తేజ, చింతల రామారావు, చౌదరి జగన్ పాల్గొన్నారు.

సారా నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత: సీఐ

కంచిలి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలన ప్రతిఒక్కరి బాధ్యత అని ఎక్సైజ్ సీఐ కె.బేబీ తెలిపారు. మంగళవారం ఎమ్మెస్‌పల్లిలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వ్యాధులపై శ్రద్ధ వహించాలి: డీఎంహెచ్‌వో

అరసవల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి):గ్రామస్థాయిలో కంటి వ్యాధులపై ఆప్తాల్మిక్ ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ కోరారు. మంగళవారం శ్రీకాకుళంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆప్తాల్మిక్ అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఆప్తాల్మిక్ అధికారులు ఎన్జీవోలు నిర్వహించే కేటరాక్టు క్యాంపులను సందర్శించి అంధత్వంతో బాధపడే వారిని గుర్తించి రిఫర్ చేయాలన్నారు. ప్రతినెలా పీహెచ్‌సీల్లో కంటి వ్యాధులతో బాధపడుతున్న వారిని సకాలంలో గుర్తించి, అవసరమైన వారిని జిల్లా ఆసుపత్రులకు పంపించాలని తెలిపారు. ప్రతినెలా అడ్వాన్స్ టూర్ ప్రోగ్రాం ప్రకారం విధిగా ప్రతిదినం ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు నమోదు చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం అధికారి కె.త్రినాథరావు, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వాన సురేష్‌కుమార్, ఆప్తాల్మిక్ అధికారులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ'ను విజయవంతం చేయాలి

రణస్థలం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు అమలుచేయాలని, ఒప్పంద జీవోల విడుదలకోసం గురువారం నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు సీహెచ్ అమ్మన్నాయుడు ఒక ప్రకటనలో కోరారు. వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్‌చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

బూర్జ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):మండలానికి చెందిన లాభాం పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.గోవిందమ్మపై త్వరలో విచారణ నిర్వహిస్తామని ఏపీవో రవికుమార్ తెలిపారు. గ్రామంలో పని నిర్వహించకుండానే కుటుంబసభ్యుల పేరుతో మస్తర్లు వేసి డబ్బులు కాజేశారని గ్రామస్థులు ఫిర్యాదుచేసినట్లు చెప్పారు. ఆగ్రామంలో 20 మందికిపైగా తన అనుయాయులకు లబ్ధిచేకూర్చారని ఆ ఫిర్యాదులో పేర్కొనట్లు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఉన్న అభియోగాలు వాస్తవమేనని చెప్పారు.

శ్రీకాకుళంలో హరేకృష్ణ ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో హరేకృష్ణ హరేరామ సంస్థ ఆధ్వర్యంలో హరేకృష్ణ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీరమేష్ ఆధ్వర్యంలో అన్నమాచార్య కీర్తనలు అలపించారు. హెచ్‌జీ రేవతి, రమణ, ప్రభు హరే రామ హరే కృష్ణపై అనుగ్రహభాషణ నిర్వహించారు.

విద్యార్థులకు అభినందన

కవిటి, మార్చి4(ఆంధ్రజ్యోతి): కవిటి ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులు బోపాల్‌లో జరిగిన జాతీయ స్థాయి కళాఉత్సవ్ పోటీల్లో ప్రతిభచూపారు.ఈమేరకు మంగళవారం డీఈవో ఎస్.తిరుమలచైతన్య మంగళవారం విద్యార్థులను అభినందించారు. వీరిని ప్రోత్సహించిన టీచర్లు పీబీకే శర్మ, గిరిబాబు, ఎన్ఈ శర్మలను అభినందించారు.కార్యక్రమంలో ఎంఈవో ధనుంజయమజ్జి, ఇన్‌చార్జి హెచ్‌ఎం జానకిరావు పాల్గొన్నారు.

●ఎచ్చెర్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అమలాపురంలో చిత్ర కళాపరిషత్ ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ చిత్రలేఖనం పోటీల్లో దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో 121 మంది విద్యార్థులు పాల్గొనగా, ఇందులో 18 బంగారు, 13 మంది కేసీపీ అవార్డులను సాధించారు. చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్ బి.రాంబాబు అభినందించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసి మృతి


మదన్‌జిన్నా (ఫైల్)

మెళియాపుట్టి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతున్నాయి.. ఉదయం అయితే ప్రజలు అందుబాటులో ఉంటారు.. వ్యాపారం జరుగుతుందనే ఉద్దేశంతో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి మంగళవారం తెల్లవారుజామున గ్రామంలో బయలుదేరి మెళియాపుట్టి వస్తుండగా పాలవ్యాన్ ఢీకొని మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఒడిశా రాష్ట్రం బిన్నళ గ్రామానికి చెందిన మదన్ జిన్నా (52) చింపండు, కొండ చీపుళ్లను గ్రామాలకు తీసుకువెళ్లి విక్రయించే వాడు.. ఎప్పటిలానే మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు గ్రామం నుంచి బయలుదేరి మహేంద్రతనయ నది వైపు నుంచి మెళియాపుట్టికి నడుకొని వస్తుండగా పర్లాకిమిడి వైపు నుంచి వస్తున్న పాల వ్యాన్ వెనుక నుంచి ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే ఆ పాలవ్యాన్ ఆపకుండా వెళ్లిపోగా సీసీపుటేజీ ఆధారంగా ఒక ప్రైవేటు కంపెనీకి చెందిన పాల వ్యాన్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య పుల్లో, ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పిన్నింటి రమేష్ బాబు తెలిపారు. వ్యాన్ డ్రైవర్ రోహిత్ కుమార్‌ను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలు

మెళియాపుట్టి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పట్టుపురం గ్రామానికి చెందిన పతివాడ మురళి జాడుపల్లి నుంచి నుంచి పట్టుపురం వైపు ద్విచక్ర వాహనం మంగళవారం వస్తుండగా బురద రామ చంద్రాపురం మలుపు వద్ద బైక్ అదుపు తప్పి గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు.

రైస్ మిల్లులో ప్రమాదం: వ్యక్తి మృతి

కోటబొమ్మాళి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చిన్న బమ్మిడి పంచాయతీలోని ఓ రైస్‌మిల్లులో సోమవారం రాత్రి జరిగిన ప్రమాదంలో చిన్నబమ్మిడి గ్రామానికి చెందిన గొండు రాజారావు (34) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రైస్‌మిల్లులో ధాన్యం ఆడుతున్న సమయం లో ఓ బస్తా ధాన్యం తొట్టిలో వేసి మరో బస్తా తెచ్చేందుకు వెళుతూ కాలుజారి ధాన్యం నిల్వ చేసే అండర్ గ్రౌండ్‌లో పడి తీవ్రంగా గాయపడ్డాడు. సమీపంలోని తోటి కలాసీలు హుటాహుటిని మిల్లు యజమానికి, 108 వాహనానికి సమా చారం ఇచ్చారు. 108 సిబ్బంది వచ్చి రాజారావును పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య జగదీశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వి.సత్య నారాయణ మంగళవారం కేసు నమోదు చేసి మృత దేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి కుమార్తె (9), కుమారుడు (6) ఉన్నారు. చిన్న పిల్లలు, తల్లిదం డ్రులు వృద్ధులు కావడంతో పెద్దదిక్కు ఆయన రాజారావు మృతితో ఆ కుటుంబం రోడ్డున పడిందని కుటుంబసభ్యులు, బంధువులు రోదిస్తున్నారు. అందరితో కలివిడిగా ఉండే రాజారావు మృతి చెందడంతో చిన్నబమ్మిడి గ్రామం శోకసంద్రంలో నిండింది.

వడ్డిపుట్టుగలో యువతి ఆత్మహత్య

కవిటి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కపాసుకుద్ది పంచాయతీ వడ్డిపుట్టుగకు చెందిన వై.సోనియా(26) మంగళవారం ఆత్మ హత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. సోనియాకు ఇటీవల వివాహ నిశ్చితార్థం జరిగింది. మేలో వివాహం చేసేందుకు నిశ్చయించారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజులుగా ఆమె మానసిక పరిస్థితి బాగో లేదు. ఇంతలో మంగళవారం ఇంటిలో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొంది. వీధిలో వారు చూసి సోనియాను స్థానికుల సహకారంతో కవిటి ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి ఆనందరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వి.రవివర్మ తెలిపారు.

విద్యార్థుల మధ్య తగాదా

మెళియాపుట్టి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల మధ్య జరిగిన తగాదాలో ఒక విద్యార్థికి బలమైన గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం పాఠశాల ఆవరణలో ముద్దుపేరుతో పిలవడంపై ఇద్దరు విద్యార్థుల మధ్య మాటమాట పెరిగి కొట్టుకునే వరకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఓ విద్యార్థి మరో విద్యార్థి తలపై కర్రతో కొట్టడంతో బలమైన గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని మెళియాపుట్టి పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తున్నారు. పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతున్న తరుణంలో ఈ తగాదా జరగడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు పాఠశాలకు వెళ్లి వివరాలు సేకరించారు. బాధిత విద్యార్థి తల్లి దండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

ఉద్యోగాలిస్తామని మోసగించడంపై ఆర్డీవో విచారణ


సన్యాసమ్మ వద్ద వివరాలు సేకరిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన తమ పిల్లలు శ్రావణి, కార్తీక్‌లకు ఉద్యోగాలిస్తామని చెప్పి రూ.18.50లక్షలను తీసుకుని మోసం చేశారని టెక్కలి గొల్లవీధికి చెందిన అత్తకోడళ్లపై సంతబొమ్మాళి మండలం బీసీ కాలనీకి చెందిన పందిరి సన్యాసమ్మ శ్రీకాకుళం 'మీకోసం'లో కలెక్టర్‌కు ఫిర్యా దు చేశారు. ఈ మేరకు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి మంగళవారం తన కార్యాల యంలో విచారణ చేపట్టారు. ఉద్యోగాలొస్తాయని.. సంతబొమ్మాళిలోని ఇంటి ని విక్రయించి రూ.10 లక్షలు, గ్రామీణ బ్యాంకులో 8 తులాల బంగారం తాకట్టు పెట్టి రూ.3.60 లక్షలు, గాజులు అమ్మడంతో పాటు కూలీ, నాలీ చేసుకొని సంపాదించిన డబ్బంతా సదరు అత్తాకోడళ్లకు ఇచ్చామని ఆర్డీవోకు బాధితురాలు తెలిపారు. తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఇప్పటికే ఈ ఘటనపై జరిగిన పూర్వాపరాలు, కేసుల వివరాలను ఆర్డీవో సేకరించారు.

బైండోవర్ అతిక్రమణ: రూ.15 వేల జరిమానా

పాతపట్నం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బైండోవర్ నిబంధనలను అతిక్రమించిన రొంపివలస గ్రామానికి చెందిన సాహుకారి పాపారావుకి రూ.15 వేలు జరిమానా విధించినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత ఏడాది మార్చి 18న సదరు పాపారావు 18 మద్యం సీసాలతో పట్టుబడగా కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో అతడు సత్ప్రవర్తన కలిగి ఉంటానని మండల మెజిస్ట్రేట్ అంగీకరించాడు. బైండోవర్ నిబంధనలను అతిక్రమించడంతో తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఎదుట ప్రవేశపెట్టగా రూ.15వేలు జరిమానా విధించారన్నారు.

కొండమ్మతల్లి ఆలయంలో చోరీ

పలాస, మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సూదికొండకాలనీలో వెలిసిన గ్రామదేవత కొండమ్మ తల్లి ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం దొంగలు చొరబడ్డారు. ఆలయంలో ఉన్న హుండీని విరగొట్టి అందులో ఉన్న రూ.10 వేల నగదు అపహరించినట్లు ఆలయ అర్చకులు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం, సాయంత్రం అమ్మవారి ఆలయం రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో మధ్యాహ్న సమయంలో దొంగలు ప్రవేశించి హుండీ తాళాలు విరగొట్టి నగదు తీసుకువెళ్లి, తాళాలను సమీపంలో పడేశారు. సీఐ పి.సూర్యనారాయణ వచ్చి క్లూస్ టీం సహాయంతో వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రబీ ఆశలు ఆ'వరి'

● ఎండుతున్న వరి చేలు ● మోటార్లతో నీటి తడికి పాట్లు
● పంటలను రక్షించుకునేందుకు రైతుల ఇక్కట్లు

నందిగాం/ఎల్ఎన్‌పేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో సాగు చేసిన వరి పంటను రక్షించుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. వంశధార సాగు నీటి కాలువల్లో నీరు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు ఉన్న చోట మోటార్లను ఏర్పాటు చేసి పొలాలకు నీరు తరలిస్తున్నా అనుకున్న మేరకు ప్రయోజనం కనిపించడం లేదని వాపోతున్నారు. ఈ పరిస్థితి నందిగాం, ఎల్ఎన్‌పేట మండలాల్లో ఉండడంతో రైతులు పంటలపై ఆశలు


ఎల్ఎన్‌పేట: దబ్బపాడులో ఇంజన్‌తో నీటిని తరలిస్తూ..


నందిగాం: దేవళభద్ర గ్రామంలో బీటలు వారిన వరి పంట పొలం

వదులుకుంటున్నారు. నందిగాం మండలంలోని నందిగాం, దేవళభద్ర, జల్లపల్లి, నరేంద్రపురం, వేణుగోపాలపురం తదితర గ్రామాల్లో వరి చేనుకు నీరందక పొలం బీటలు వారుతోంది. ఎల్ఎన్‌పేట మండలం శ్యామలాపురం, తురకపేట, చింతలబడ వంజ, చిట్టిమండలం, ధనుకువాడ, కోవిలాం తదితర గ్రామాల్లోని పంటలకు సాగు నీరందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెట్టుబడి పెట్టామని, నీటి తడులు పెట్టేందుకు అదనంగా వెచ్చించాల్సి వస్తోందని, అయితే పంట చేతికి అంది వస్తుందా అన్న అనుమానాలను వారు వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా కాలువల ద్వారా నీటిని విడుదల చేసి పంటలను రక్షించుకునేందుకు సహకరించాలని వారు అధికారులను వేడుకుంటున్నారు.

పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

● సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి

హరిపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించాలని సీతంపేట ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆకాంక్షించారు. బుడంబో, పట్టులోగాం, కిల్లోయి ఆశ్రమ పాఠశాలలను మంగళవారం ఆయన సందర్శించారు. బుడంబోలో విద్యార్థినులకు పాఠం చెప్పి వారికి ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. పాఠశాలల్లో టాపర్‌గా నిలుస్తున్న వారిపై దృష్టి సారించి ఉత్తమ లక్ష్యాలు సాధించేలా తయారు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే మిగిలిన విద్యార్థులపై దృష్టి సారించి ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణులయ్యేలా చూడా లన్నారు. భోజనాల నాణ్యతను పరిశీలించారు. అనంతరం మందస, బుడంబో కాలనీ పీహెచ్‌సీ లను సందర్శించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, బయో వ్యర్థాలను దూరంగా ఉంచాలన్నారు. గడువుదాటిన మందులను వినియోగించవద్దని ఆదేశించారు. తాగునీటి సమస్యలను పరిష్క రించి రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రామకృష్ణ, సీతారామమూర్తి, శ్రీరాములు, వైద్యాధికారులు సూర్య, పూర్ణరవిచంద్ర, సంపత్‌రావు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పీవో సుడిగాలి పర్యటన


మెళియాపుట్టి: నందలపాడులో మల్టీపర్పస్ కేంద్రం పనులను పరిశీలిస్తున్న పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి

మెళియాపుట్టి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. ఎర్రన్న గూడ, సవర చీడిపాలెం, నందల పాడు గ్రామాల్లో నిర్మిస్తున్న మల్టీ పర్పస్ భవనాల నిర్మాణాలను పరిశీలించారు. పనులను వేగవంతం చేయా లని, నాణ్యత ప్రమాణాలు పాటించాల న్నారు. భవనా లకు విద్యుత్ సమస్య ఉందని తెలుపగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భరణికోట గిరిజన బాలిక ల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడుతూ.. ప్రణాళికా బద్ధంగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. మెనూ అమలును అడిగి తెలుసుకున్నారు. కరజాడ పీహెచ్‌సీని సందర్శించి ఓపీ, రికార్డులు, ప్రసవాల క్యాలెండర్‌ను పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డీఈ సిమ్మన్న తదితరులున్నారు.

ఇంటి పన్ను బకాయిలు వసూలు చేయండి

జలుమూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను బకాయిలు సత్వరమే వసూలు చేయాలని డీఎ ల్పీవో ఐవీ రమణ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో రూ.కోటి పైగా ఇంటి పన్ను బకాయిలున్నాయన్నారు. ఇప్పటివరకు రూ.33 లక్షలు మాత్రమే వసూలు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెలాఖరులోగా శతశా తం బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు. చెత్త నుంచి సంపద కేంద్రాలు వృథాగా ఉన్నాయని, వాటిని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

7 నుంచి నివగాంలో ఎల్లమ్మ జాతర


పూజలందుకుంటున్న ఎల్లమ్మ

కొత్తూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నివగాంలో ఈనెల 7వ తేదీ నుంచి 11 వరకు శిర్లి పోతన్న, ఎల్లమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రానున్నందున వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటారన్నారు. అంటురోగాలు ప్రబలకుండా పంచాయతీ అధికారులు శానిటేషన్ చేయించారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు ఎదురు కాకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఐదు రోజులు రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఓపెన్ కబడ్డీ పోటీలు


విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

పలాసరూరల్,మార్చి 4(ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు యువజన సంఘం 71వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు సోమవారం అర్ధరాత్రి ముగి శాయి. ఫ్లడ్‌లైట్ల వెలుగులో సాగిన పోటీల్లో బహడాపల్లి జట్టుపై జెస్సీ టీమ్ విజేతగా నిలిచింది. మూడో స్థానంలో వైజాగ్ వారియర్స్ నిలిచింది. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహు మతులు సాధించిన వారికి నగదు పురస్కారంతో పాటు ట్రోఫీలను అంద జేశారు. కార్యక్రమంలో యువజన సంఘం ప్రతినిధి తామాడ త్రిలోచన రావు, రైతుసంఘం అధ్యక్షుడు రాజాం గుణవంతు, బత్తిని వాసు, రామారావు, పి.గీతమ్మ, రాజాం పద్మ, గర్తం తులసీరావు, బొడ్డు దుష్యంత్, దశరథరావు, బొడ్డు జగన్, తామాడ గంగయ్య, గంగాధర్ పాల్గొన్నారు.

పార్టీల నిర్మాణాలు, విధానాలను గమనించాలి

పలాసరూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వివిధ పార్టీల నిర్మాణా లు, విధానాలను ప్రతి సభ్యుడు గమనించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పొలిట్‌బ్యూరో సభ్యుడు శంకర్ అన్నారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో మంగళవారం సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ రాజకీయ శిక్షణా తరగ తులు నిర్వహించారు. ఈ తరగతులకు కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.మూర్తి, నాగమణి, మద్దిల మల్లేశ్వరరావు, రాష్ట్ర నాయకులు హరనాథ్, సత్యనారాయణ, కిరణ్ పాల్గొని పలు అంశాలపై చర్చించారు. దేశ పరిస్థితులకు తగినట్లు సభ్యులకు ప్రస్తుతం ఉన్న బూర్జువా పార్టీల పరిస్థితులు, తేడాలను వివరించారు. ఈ శిక్షణ మూడురోజుల పాటు జరుగుతుందన్నారు. శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, ఏఐకేఎం జిల్లా నాయకులు ఎం.రామారావు, దున్న శ్రీనివాస్, దుష్యంత్, కడప, అన్నమయ్య జిల్లా, విశాఖ, గుంటూరు, నంద్యాల, పల్నాడు, కృష్ణా జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి


ముందస్తు లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రసన్నలత

కోటబొమ్మాళి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో ఈనెల 8వ తేదీన నిర్వ హించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత కోరారు. మంగళ వారం కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో ప్రత్యేక సమావేశం, ముందస్తు లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు. వీటిని 8న జరగనున్న లోక్ అదాలత్‌లో నిర్ధారిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు లఖినేని శ్రీనివాసరావు, వై.వెంకటరావు, బి.నారాయణ రావు, బి.మధు, బి.జీవన్, పి.బాబూరావు, కోటబొ మ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు, నౌపడ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

ఎల్.ఎన్.పేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి వాహనాలను నడిపితే చర్యలు తప్పవని సరుబుజ్జిలి ఎస్‌ఐ బి.హైమవతి హెచ్చరించారు. లక్ష్మీనర్సుపేట జంక్షన్‌లో మంగళ వారం వాహనాలను తనిఖీ చేశారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు.

డీఈవో బ్లాగ్‌లో టీచర్ల సీనియారిటీ జాబితా

● 10లోగా అభ్యంతరాలు తెలపాలి: డీఈవో

నరసన్నపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల తాత్కాలిక సీనియారిటీ జాబితాలను డీఈవో బ్లాగ్‌లో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని డీఈవో తిరుమల చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల జాబితాలను టీచర్ల సమాచార వ్యవస్థ(టీస్) ఆధారంగా రూపొందించి బ్లాగ్‌లో ఉంచామన్నారు. సీనియారిటీ జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 10తేదీలోగా డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. అభ్యంతరాలు తెలిపే ఉపాధ్యాయులు తమ పేరు, ఐడీ, ఉద్యోగ కేటగిరీ వివరాలతోపాటు సీనియారిటీలో ఎక్కడ అభ్యంతరం ఉందో స్పష్టంగా ఆధారాలతో తెలియజేయాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎమ్మెల్సీగా 'గాదె' విజయంపై హర్షం

వజ్రపుకొత్తూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులు నాయు డు విజయంపై ఏపీటీఎఫ్ నేతలు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు మంగళవారం ఏపీటీఎఫ్ జిల్లా ఉపా ధ్యక్షుడు మామిడి భుజంగరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ విజయం చారి త్రాత్మకమన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.నాగేశ్వరరావు, గున్న సుభాష్, శోభన్, ఉదయ్, సురేష్, కృష్ణారావు పాల్గొన్నారు.

వైసీపీ ముసుగు వేయడం దారుణం

నరసన్నపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా యూటీఎఫ్‌కు వైసీపీ ముసుగు వేసి మంత్రి అచ్చెన్నా యుడు అనడం దారుణమని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్, జిల్లా అధ్యక్షుడు ఎల్.బాబూరావు, ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి ఒక ప్రక టనలో పేర్కొన్నారు. వాస్తవానికి ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ అభ్యర్థులకు కూటమి ముసుగు వేయడం ద్వారా అధికార పక్షమే ఉపాధ్యాయ ఉద్యమంలో చీలికలు తెచ్చిందని విమర్శించారు.

పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాలి

పలాస, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జామి ఎల్లమ్మ జాతర సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పారి శుధ్య సమస్యలు తలెత్తకుండా సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు ఆదేశించారు. ఈ మేరకు యాత్ర జరుగు ఆలయ పరిసరాలను మంగళవారం పరిశీలించారు. యాత్రను పండగ వాతావరణంలో చేపట్టనున్నామన్నారు. రోడ్లపై విద్యుద్దీపాలంకరణ చేస్తున్నామని, పెద్ద ఎత్తున భక్తులు రానుండడంతో తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. యాత్రకు వచ్చే భక్తులకు తాగునీరు, ప్రసాదాలు మునిసిపాలిటీ నుంచి అందించనున్నట్లు పేర్కొన్నారు.

రెవెన్యూ సదస్సుల వినతులను పరిష్కరించాలి


కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకటేష్

నందిగాం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులన్నీ త్వరితగతిన పరిష్కరించాలని పలాస ఆర్డీవో జి.వెంకటేష్ ఆదేశించారు. మంగళవారం నందిగాం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా వచ్చిన వినతులు, పరిష్కారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేయడంతో పరిశీలించారు. దేవాడ, నర్సిపురంలలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్చేందుకు వచ్చిన దరఖాస్తుల మేరకు పరిశీలించారు. కార్యక్రమం లో తహసీల్దార్ పి.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

15 రోజులు ఒక్కపూటే నీటి సరఫరా

నరసన్నపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీలో మరో 15 రోజుల పాటు ఒక్క పూట మాత్రమే తాగునీరు సరఫరా చేస్తున్నట్లు సర్పంచ్ బి.శంకరరావు, ఈవో ద్రాక్షాయిణి తెలిపారు. నరసన్నపేటకు దేవాది వద్ద బోరుబావులు కూలిపోవడంతో తక్కువ నీరు వస్తోందని, అందువల్ల కొత్తగా బోరుబావులు డ్రిల్లింగ్ చేసేందుకు ప్రత్యేక యంత్రాలు కావాల్సి ఉందన్నారు. అందువల్ల పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. ఇంటి అవసరాలకు కాకుండా కేవలం తాగేందుకు మాత్రమే కొళాయిల ద్వారా వస్తున్న నీటిని వినియోగించుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.

న్యూస్ బాక్స్

నేడు అల్లిమెరక రైల్వే గేటు మూసివేత

హరిపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మందస మండలం మఖరజోల- అల్లిమెరక మధ్య రైల్వే గేటు వద్ద బుధవారం మరమ్మతులు చేపడుతున్నందున గేటు మూసివేస్తున్నట్లు రైల్వే ఇంజనీరింగ్ అధికారి తెలిపారు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు కొర్రాయి గేటు మీదుగా తర లించాలని కోరారు.

నీలమణి దుర్గమ్మకు చల్లదనం

నందిగాం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నందిగాంలో కొలువై ఉన్న నీలమణిదుర్గ (పాతపట్నం అమ్మతల్లి) అమ్మ వారికి మంగళవారం చల్లదనం చేశారు. ప్రథమ వార్షికోత్సవం అనంతరం మారువారం సందర్భంగా మేళతాళాలతో గజముద్దలు, కలశాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదన

కొత్తూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి) కొత్తూరు-హడ్డుబంగి మార్గంలో నివగాం ఎస్సీ వీధి వద్ద కోతకు గురై గోతుల మయంగా ఉండడంతో రోడ్డు నిర్మాణానికి రూ.18 లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు హిరమండలం ఆర్అండ్ బీ జేఈ గోపాలరావు తెలిపారు. మంగళవారం నివగాంలో రెవెన్యూ, ఆర్అం డ్‌బీ సంయుక్తంగా సర్వే నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా సుమారు 70 ఇళ్లు ఆక్రమణలో ఉన్నాయన్నారు. దీనివల్ల మురుగునీరు, వర్షపునీరు రోడ్డుపై నిలిచిపోయి గోతులమయంగా తయారైందని గుర్తించామన్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సూచనల మేరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. మండల సర్వేయర్ గవరయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శ్రీమురళీకృష్ణ ఆలయ వార్షికోత్సవం

జలుమూరు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అబ్బాయిపేటలో కొలువు తీరిన శ్రీ మురళీకృష్ణ ఆలయం 46వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం స్వామి వారి కల్యాణం శ్రీకూర్మం వేదపండితుడు జగన్నాథా చార్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు అర్చకుడు దివాకర్ తెలిపారు. ఉదయం స్వామివారి తిరుమంజనం, ప్రత్యేక పూజలు చేస్తున్నామన్నారు. సాయంత్రం స్వామివారి తిరువీధి, రాత్రి రుక్మిణి, సత్యభామ సమేత శ్రీమురళీకృష్ణుని కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

నందిగాం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో టి.రాజారావు కార్యదర్శులకు సూచించారు. పలు గ్రామాల్లో మంగళవారం రక్షిత నీటి పథకాను పరిశీలించారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్యలు లేకుండా రక్షిత పథకాలు, బోర్లకు మరమ్మతులు చేయాలన్నారు.

బుచ్చిపేటలో జ్వరాలు

నరసన్నపేట, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బుచ్చిపేటలో విషజ్వరాలతో ప్రజ లు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన సుమారు 40 మంది కొన్నాళ్లుగా విషజ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వ హించాలని, పారిశుధ్య పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. వాతావరణం మార్పుల వల్లే వైరల్ జ్వరాలు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

'ఉన్నతి'తో ప్రయోజనం

హరిపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉన్నతి పథకం గిరిజనులకు ఎంతో ప్రయోజనకరమని వెలుగు ఏపీఎం పి.కూర్మా రావు అన్నారు. కుసుమాల గ్రామంలో మంగళవారం మహిళా సంఘ సభ్యు లతో సమావేశం నిర్వహించారు. రుణాల మంజూరు, రికవరీలతో ముందు సాగాలని, స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక భరోసా పొందాలని సూచించారు. సీసీలు ఆనంద్, జగబందు పాల్గొన్నారు.

8న పీవోడబ్ల్యూ సంస్థల విలీనం

పలాసరూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈనెల 8న పీవో డబ్ల్యూ సంస్థల విలీన సభ జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలని జిల్లా నాయకులు కోరారు. మాకన్నపల్లిలో మంగళవారం విలీన సభ పోస్టర్‌ను రెండు సంస్థల అధ్యక్షులు ఎస్.కృష్ణవేణి, బి.ఈశ్వరమ్మ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కుసుమ, ఉపాధ్యక్షురాలు కుత్తుమ హేమక్క, కోశాధికారి జానకి పాల్గొన్నారు.

100 సారా ప్యాకెట్ల స్వాధీనం

కొత్తూరు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సోమరాజపురం గ్రామానికి చెందిన వాన శ్రీనివాసరావు వద్ద నుంచి 100 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, సదరు వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్లు కొత్తూరు ఎక్సైజ్ సీఐ కిరణ్‌మనేశ్వరి తెలిపారు. సారా నియంత్రణపై ప్రజల్లో చైతన్యం చేసేందుకు గ్రామానికి వెళ్లిన సమయంలో సారా ప్యాకెట్‌లు విక్రయిస్తున్న విషయం తెలుసుకుని శ్రీనివాసరావు పెంటలో పాతిపెట్టిన సారా ప్యాకెట్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు నిందితుడిని కోర్టులో హాజరు పరిచామన్నారు.